క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



మదనాపురం: మదనాపురం మండలంలోని కొన్నూర్‌కు చెందిన తిరుపతమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ2.50లక్షల ఎల్‌ఓసీని గురువారం ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వరెడ్డి తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

అమరచింత: మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి కుళాయిలకు సంబంధించిన పన్నులను వెంటనే చెల్లించాలంటూ మున్సిపల్ మేనేజర్ గోవింద్ కోరారు. గురువారం పట్టణంలోని ఆయా వార్డుల్లోని ఇంటింటికీ వెళ్లి కుళాయి పన్నుల వసూళ్ల కోసం సిబ్బందితో కలిసి తిరిగారు. ఇంటి పన్నులు చెల్లించలేని వారి కుళాయిలను తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభాకర్, హరికృష్ణ ఉన్నారు.

కరపత్రాల విడుదల

పెబ్బేరు రూరల్: బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల మెదడులో మత విషయం నింపే కుట్ర చేస్తుందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, వనపర్తి డివిజన్ కార్యదర్శి వంశీ విమర్శించారు. గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ 30వ జాతీయ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రకాశ్, ప్రసాద్, విజయ్, భాను, సాగర్, మోహన్, అభిరామ్, కిరణ్, సందీప్, సూర్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాలలో ఆంగ్లభాషా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న జ్యోతినయానా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాలలో గురువారం హెచ్‌ఎం కురుమయ్య, ఉపాధ్యాయ బృందం సన్మానించారు.

పందుల పెంపకందారులకు నోటీసులు

అమరచింత: పట్టణంలోని పందులను పట్టణ శివారులోకి తరలించాలంటూ మున్సిపల్ అధికారులు యాజమానులకు గురువారం నోటీసులు అందించారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజ మాట్లాడుతూ పందులతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పలుమార్లు యాజమానులకు చెప్పిన పందులను తరలించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్షం రోజులో పట్టణంలోని పూర్తి స్థాయిలో పందులను తరలించకుంటే వాటిని మున్సిపాలిటీ ద్వారా పట్టుకుని ఇతర రాష్ట్రాలకు తరలిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు గురువారం మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో నాగర్‌కర్నూల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు పార్టీలో చేరిన వారు తెలిపారు. కార్యక్రమంలో ఎత్తం కృష్ణయ్య, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

- పొదుపు సంఘాలను బలోపేతం చేయాలి
- మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మహ్మద్‌ఖాజా

అమరచింత: మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులు పొదుపులో ముందుండి ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా కోరారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్‌తో కలిసి గురువారం మహిళా సంఘాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పొదుపు చేయడంలో మహిళలు ముందుండేలా అవగాహన కలిప్పించాలని మెప్మా ఆర్పీలకు సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ భారాన్ని భరిస్తూ బ్యాంకుల ద్వారా రుణాలు పొందుతున్న మహిళా సంఘాల సభ్యులు ప్రతి నెల క్రమం తప్పకుండా వాయిదాలను చెల్లించేలా చొరవ చూపాలన్నారు. బ్యాంకు రుణాలు పొంది వాయిదాలను చెల్లించని మహిళలపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చి వారికి అవగాహన కల్పించారు. ఐదు మంది పొదుపు మహిళలు గ్రూపుగా ఏర్పడితే వ్యక్తిగత యూనిట్ కోసం రుణాలను ఇస్తున్నామన్నారు. కుటీర పరిశ్రమల వ్యాప్తి కోసం మహిళలను ప్రోత్సహించాలని ఆర్పీలకు సూచించారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. వర్షాకాలంలో ఇంటి ముంగిళ్లు అపరిశుభ్రంగా ఉండటం ద్వారా ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. డెంగ్యూ దోమల ద్వారా విషజ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని, జాగ్రత్తలు పాటించాలని కోరారు.

కేసీఆర్ సభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కొల్లాపూర్ నియోజవర్గంలోని నార్లాపూర్ వద్ద ఈనెల 16న సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారని జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ తెలిపారు. అనంతరం కొల్లాపూర్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు మండలంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు ఆకుల శ్రీను, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, గాడీల ప్రశాంత్, ఉప సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, సంపత్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాజు తదితరులు ఉన్నారు.

మొక్కలు సంరక్షించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: హరితహారంలో భాగంగా గ్రామాల్లో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం పాలమూర్ రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభించడానికి సీఎం కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో మండలం నుంచి నార్లాపూర్ వెళ్లే రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ చక్రపాణి, ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, ఏపీఎం సక్రూనాయక్ పాల్గొన్నారు.

ముందుచూపుతోనే బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న కృష్ణయ్య

వనపర్తి టౌన్: విద్యార్థులకు ముందుచూపు ఉంటేనే భవిష్యత్తులో ఉన్నతంగా రాణించగలరని న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు డేగల కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని బాలికల ఎస్సీ వసతి గృహంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నతంగా జీవించేందుకు ఒక లక్ష్యాన్ని పెట్టుకోవాలని, దాని కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. విద్యార్థులకు చట్టాల గురించి, సైబర్ క్రైమ్ తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య, సఖీ కేంద్రం నిర్వాహకురాలు కవిత, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

బైక్, ట్రాక్టర్ ఢీ

కొత్తకోట రూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని రాయిణిపేట శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామానికి చెందిన కావలి శ్యాంసుందర్ రాయిణిపేట స్టేజీ నుంచి పెద్దగూడెం గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. అటువైపు నుంచి హైవే వైపు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న కావలి శ్యాంసుందర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108లో బాధితుడిని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి తల్లి కావలి అనసూయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అవినీతి రహిత తెలంగాణ సాధిద్దాం



ర్యాలీలో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎంపీపీ మేఘారెడ్డి, నాయకులు

వనపర్తి: అవినీతి రహిత తెలంగాణ సాధిద్దామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని చింతల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి గాంధీచౌక్, అంబేడ్కర్, రాజీవ్‌చౌక్‌ల మీదుగా లక్ష్మీకృష్ణ గార్డెన్స్‌లో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సన్నాహక సమావేశానికి ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో, వనపర్తిలో విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టికెట్ల విషయంలో అధిష్టానం తీసుకునేదే తుది నిర్ణయమన్నారు.

బిల్లుల చెల్లింపులో అక్రమాలు

కానాయపల్లి శంకర సముద్రం వద్ద ఇన్నర్ కెనాల్, ఔటర్ కెనాల్‌కు సంబంధించిన పనులు అప్పటికే పూర్తయ్యాయని, రింగుబండ్ పనులు పూర్తయితే దాని నుంచి నీళ్లు సరఫరా అవుతాయన్న కోణంలో తాను రింగుబండ్ పనులు పూర్తి చేస్తే వాటి ద్వారా పానగల్ మండలం వరకు సాగునీరొచ్చిందని అన్నారు. పని చేసినందుకు తనకు బిల్లులు ఇవ్వకపోగా.. తన పేరుమీద కూడా బిల్లులు చేసుకొని తిన్న చరిత్ర వనపర్తి బీఆర్‌ఎస్ నాయకులదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో పేదలు నిరుపేదలుగా మారారని వాపోయారు. వీరాయపల్లిలోని వేరుశనగ పరిశోధన కేంద్రం పనులు తాను చేస్తే మంత్రి తన అనుచరుల పేరున నిధులు మంజూరు చేయించుకున్నారని మండిపడ్డారు. ఏదుల రిజర్వాయర్‌తో నియోజకవర్గంలో ఎన్ని ఎకరాలకు సాగునీరు అందుతుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న విజయభేరి కార్యక్రమానికి భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాధాకృష్ణ, వెంకటేష్, బ్రహ్మంచారి, సర్పంచ్‌లు, శ్రీనివాస్ రెడ్డి, రాధాకృష్ణ, రమేష్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సత్యారెడ్డి, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి



గోవిందహళ్లిలో ఈవీఎం మిషన్లపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ అబ్రహంలింకన్

గోపాల్‌పేట: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని పంచాయతీల వద్ద ముగ్గులు వేసి అక్కడికి వచ్చిన ప్రజలకు ఓటు విలువను తెలియజేశారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

మదనాపురం: మండలంలోని గోవిందహళ్లిలో ఈవీఎం, వీవీ ప్యాట్ మిషన్లతో తహసీల్దార్ అబ్రహంలింకన్ గురువారం ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనర్ షేక్ మున్నా, సీనియర్ అసిస్టెంట్ రాఘవేందర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అవకాశం కల్పించాలి

కొత్తకోట రూరల్: చట్ట సభల్లో బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో విద్యార్థి సమరభేరి సభకు వెళ్లిన ఆర్.కృష్ణయ్య తిరుగు ప్రయాణంలో కొత్తకోట మండలం కానాయపల్లి శివారులో నిర్మాణంలో ఉన్న శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణాన్ని పరిశీలించారు. ఆర్.కృష్ణయ్యను స్థానిక యాదవ సంఘం, బీసీ సంఘం నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీచుపల్లి రాములుయాదవ్, యుగంధర్‌యాదవ్, వెంకటన్నగౌడ్, పెంటన్నయాదవ్, హోటల్ కురుమూర్తి యాదవ్ తదితరులు ఉన్నారు.

ధాన్యాన్ని గోదాంల్లో నిల్వ చేయండి



మాట్లాడుతున్న అధికారి శ్యామ్‌కుమార్

పెబ్బేరు రూరల్: రైతులు పండించిన ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాకపోతే ప్రభుత్వ గోదాముల్లో నిల్వ చేసుకోవాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యామ్‌కుమార్ సూచించారు. ఆయన గురువారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోయినా.. తక్కువ ధరలకు అమ్ముకుంటూ రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పడుతున్న కష్టాలను అధ్యయనం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిడ్డంగుల అభివృద్ధి, నియంత్రణ సంస్థను ఏర్పాటు చేశామని, గిట్టుబాటు ధర లభించే వరకు ప్రభుత్వ గోదాముల్లో నిల్వ ఉంచుకొని మెరుగైన ధరలు వచ్చిన తర్వాత ధాన్యాన్ని విక్రయించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గోదాముల్లో నిల్వ ఉంచిన పంటలకు 80 శాతం బ్యాంకు నుంచి రుణం తీసుకొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు జగన్నాథం నాయుడు, సీఈఓ శివకుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాఘవ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎస్‌ఎఫ్‌ఐ బృందం సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి పాఠశాలలో సైన్స్, హిందీ, బయాలజీ, పీఈటీ ఉపాధ్యాయులు లేని కారణంగా పాఠ్యాంశాలు కొనసాగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అదనపు తరగతి గదులు, డైనింగ్‌హాల్ లేవని, బాలురులు, బాలికలకు ఒకే బాత్రూం ఉందని, భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఇందు, రాంచరణ్, ఐశ్వర్య, తిర్మలేష్, వినోద్, సలీం, సేనాపతి, గణేష్, నందిని, గాయత్రి, కళ్యాణి, విద్యార్థులు ఉన్నారు.

హిందీపై పట్టు సాధించాలి



ఆత్మకూర్‌లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూర్: విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించాలని జీహెచ్‌ఎం లక్ష్మీదేవి, భాషోపాధ్యారాలు సునీత అన్నారు. హిందీ భాష దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. భారత జాతీయోద్యమంలో భారతీయుల్ని ఏకతాటిపైకి తెచ్చి ఉద్యమం ఉవెత్తున ఎగిసిపడేందుకు హిందీ భాష ఎంతో దోహదపడిందని గుర్తుచేశారు. 1949 సెప్టెంబరు 14న హిందీ భాషను జాతీయ అధికార భాషగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఇందిర, సురేఖ, మెలోడి, పద్మజ, జమునరాణి, మానస, లలిత, ఫౌజీయాబేగం, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్ సారథ్యంలో గురువారం హిందీ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ఇన్‌చార్జీ హెచ్‌ఎం వేణాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు హిందీ భాషలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హిందీ, తెలుగు, ఆంగ్లం త్రిభాషా డిక్షనరీలను, సులభంగా హిందీ నేర్చుకోవడం ఎలా అనే పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయుడు మాట్లాడుతూ త్రిభాషా సూత్రాన్ని తెలుగు మాతృభాషతో పాటు జాతీయభాష హిందీ తప్పకుండా చేర్చుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్, నాగన్న, రాజశేఖర్‌గౌడ్, వరలక్ష్మి, పీఈటీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

'నియంతృత్వ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం'



వనపర్తిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

వనపర్తి టౌన్: కేసీఆర్ కొంత కాలమే అక్రమ అరెస్టులను చేయించగలడని, బీఆర్‌ఎస్ పాపం పండిందని వచ్చే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ అన్నారు. కిషన్‌రెడ్డి నిరుద్యోగుల కోసం దీక్ష చేపడితే అక్రమ అరెస్టు చేస్తారా అని నిలదీస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో నల్లబ్యాడ్జీలతో బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కేసీఆర్ అవినీతి పాలనలో రాష్ట్రంలో ఏ వర్గ ప్రజలు అభివృద్ధి చెందలేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జింకల కృష్ణయ్య, శ్రీనివాస్‌గౌడ్, బుడ్డన్న, వెంకటేశ్వర్ రెడ్డి, కుమారస్వామి, పరశురాం, రామ్‌మోహన్, ప్రభాకర్, శివారెడ్డి, పెద్దిరాజు, మూర్తి, కుమార్, కరీం ఉన్నారు.

ఖిల్లాఘనపురం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ గురువారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, ఆశన్న, అంజనేయులు, శివశంకర్, రాంచందర్, భద్రయ్య, పురుషోత్తం, మహేందర్ ఉన్నారు.

ఆత్మకూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని తిప్పడంపల్లిలో గ్రామస్తులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. మక్తల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అభివృద్ధిని విస్మరిస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో అశ్విన్‌కుమార్, అశోక్‌కుమార్‌జీ, నాగేందర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, శశిధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో బీజెవైఎం రాష్ట్ర కన్వీనర్ మేర్వరాజు, క్యామభాస్కర్, నరాల నారాయణ, మరాఠి అశోక్, సిద్దురాములు, హరిష్, రాకేష్ పాల్గొన్నారు.

మట్టి సేకరణ

పెబ్బేరు రూరల్: ఢిల్లీ నిర్మిస్తున్న అమరవీరుల స్మారక చిహ్నం కోసం దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి మట్టి సేకరణ జరుగుతుందని బీజేపీ కార్యవర్గ సభ్యుడు బి కృష్ణ అన్నారు. సవాయిగుడెం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మట్టి సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎద్దుల దేవేందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దిరాజు, దాసరి లక్ష్మారెడ్డి, మధు, మోహన్ రెడ్డి ,బద్రీ,వంశీ,బాలరాజు,చరణ్, అరవింద్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను ప్రతిష్ఠిద్దాం



కొత్తకోట రూరల్: మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుదామంటూ మండలంలోని రామకృష్ణాపురంలో హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర కాలుష్య నియంత్రి మండలి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశానుసారం పార్యావరణంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రజలు నవరాత్రులు పర్యావరణహితంగా నిర్వహించాలని కోరారు. రసాయనాలతో చేసిన విగ్రహాలను ప్రతిష్ఠిస్తే నిమజ్జనం అనంతరం నీటితో సహా పర్యావరణం తీవ్రంగా కలుషితం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రేవతమ్మ, కల్పన, రజిత, పృథ్వీ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల తాళాలు తొలగించడం సరికాదు



వనపర్తిలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

ఆత్మకూర్: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె కారణంగా మూసి ఉన్న కేంద్రాల తాళాలను ఐసీడీఎస్ అధికారులు పగులగొట్టి ప్రవేశించడాన్ని తప్పుపడుతూ గురువారం ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీహరి, శారదమ్మ, సారమ్మ, అరుణమ్మ, ఆశమ్మ, నాగమ్మ, కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వినతిపత్రం అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, అధికారులు అంగన్‌వాడీ టీచర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి

పెబ్బేరు రూరల్: అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శి జ్యోతి, సుమతి డిమాండ్ చేశారు. గురువారం టీచర్లు, ఆయాలు, మినీ టీచర్లు తమ హక్కుల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శారద, నారాయణమ్మ, కవిత, జ్యోతి, రాధ, రమాదేవి, సునీత, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని రెండు వేరు వేరు చోట్ల దొంగతనానికి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులపై కేసు నమోదు కాగా.. ఇద్దరిని గురువారం రిమాండ్‌కు పంపినట్లు వనపర్తి రూరల్ ఎస్‌ఐ నాగన్న తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాల ప్రకారం.. వీపన్‌గండ్ల మండలంలోని కొర్లకుంటకు చెందిన కేతావత్ రమేష్ నాయక్, సాయి, భాస్కర్ కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల 5న వీరు పెద్దగూడెం హిందూస్థాన్ పెట్రోల్ పంపులో ఇనుప సామాన్లు, స్క్రాప్‌బ్యాటరీలు దొంగతనం చేశారు. అనంతరం ఈ నెల 10న వనపర్తి పట్టణ కేంద్రంలోని మర్రికుంట ఆంజనేయస్వామి ఆలయం హుండీలో రూ.7వేల నగదును దొంగిలించారు. గురువారం రమేష్‌నాయక్, సాయి ఆటోలో పెద్దగూడెం వైపు వెళ్తుండగా పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో వీరిపై అనుమానం రావడంతో విచారించగా దొంగతనం ఒప్పుకున్నారు.దీంతో కేసు నమోదు చేసి రమేష్‌నాయక్, సాయి గురువారం కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు పంపిచామన్నారు. మరో నిందితుడు భాస్కర్ పరారీలో ఉన్నాడని ఎస్‌ఐ నాగన్న తెలిపారు.

గీత కార్మికుల హామీల అమలు ఎక్కడ?



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: మునుగోడు ఉప ఎన్నికల్లో సీఎం కేసీఆర్ కల్లు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదని గౌడ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో బండారు శ్రీనివాస్‌గౌడ్, రామచంద్రయ్యగౌడ్ అధ్యక్షతన కల్లుగీత కార్మికుల మహాధర్నా వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 5లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి సరైన భద్రత లేక తాళ్లు ఎక్కే క్రమంలో వందల మంది ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరణించిన గీత కార్మికులకు సంఘీభావంగా కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో రమేష్ గౌడ్, సురేష్‌గౌడ్, కృపానందం, రామన్‌గౌడ్, కృష్ణయ్య గౌడ్, రాజు, వెంకటస్వామి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.